క్లుప్తంగా

మందలపును పరామర్శించిన ఎలీజా

లింగపాలెం : మఠంగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందలపు సత్యన్నారాయణను గురువారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పరామర్శించారు. సత్యన్నారాయణ కొద్ది రోజుల క్రితం ఊపిరితిత్తుల సమస్యతో విజయవాడ హాస్పటల్‌లో వైద్య చికిత్సలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రంగాపురం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ముళ్లంగి లోక్‌నాథ్ రెడ్డి, పార్టీ నాయకులు రావి కొండయ్య, ఉన్నమట్ల జీవన్, మందలపు నరసింహారావు, ఎం.వేణు, వేమనరెడ్డి, మేకల రాజు, నూతలపాటి శ్రీను, పల్లి రాంబాబు తదితరులు మందలపు సత్యనారాయణను పరామర్శించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 3 లక్షల విరాళం



దాత శ్రీనివాసరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా గురువారం రూ. 3,00,116 లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా నల్లజర్లకు చెందిన యలమాటి శ్రీనివాసరావు రూ.1,00,116లను ఆలయ కార్యాలయంలో, విజయవాడకు చెందిన ఘంటా వీరవెంకట గోవర్ధనరావు రూ.2 లక్షలను నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, కేఎల్ఎన్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

డప్పుకళాకారులకు సన్మానం

బుట్టాయగూడెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కేవీపీఎస్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులకు గురువారం స్థానిక బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద డప్పు వాయిద్య పోటీలు నిర్వహించారు. డప్పు కళాకారులను ఎస్సై ఎం.జయబాబు, కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ఉండ్రాజవరపు పెంటయ్య, దొండపాటి వెంకటేశ్వరరావు, దొండపాటి సోమయ్య, ఏలేటి జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయి శివాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, ఆలయ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు, కనిక్ల ప్రసాద్, చీదిరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా కాస్తున్న వ్యక్తి అరెస్ట్

చింతలపూడి : సారా కాస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎర్రగుంటపల్లిలో రిజర్వు ఫారెస్టులో తనిఖీ చేస్తుండగా, చేను సత్యనారాయణ అనే వ్యక్తి సారా కాస్తూ పట్టుబడ్డాడన్నారు. రిజర్వు ఫారెస్టులో ఏర్పాటు చేసిన బట్టీ వద్ద 100లీటర్ల బెల్లపు ఊట, 15 లీటర్ల నాటు సారా గుర్తించి, బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సారాను, ఒక డ్రమ్ము, రెండు అల్యూమినియం పాత్రను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చేను సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

బెదిరింపు నేరంపై కేసు నమోదు

చింతలపూడి : స్నేహితుడిని బెదిరించిన నేరంపై ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి వ్యాపారస్తుడు మద్దుల కేదారేశ్వరరావుతో సమ్మెటవారిగూడానికి చెందిన ధనసిరి కిరణ్‌కుమార్ పరిచయం పెంచుకుని స్నేహం చేస్తున్నాడన్నారు.ఈక్రమంలో కిరణ్‌కుమార్ డబ్బులు ఇవ్వమని కేదారేశ్వరరావును అడుగుతూ, డబ్బులు ఇవ్వకపోతే కుటుంబసభ్యులను చంపుతానని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై కేదారేశ్వరరావు ఫిర్యాదు చేయగా కిరణ్‌కుమార్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మన్నకు నివాళి

జంగారెడ్డిగూడెం : ధర్మన్న ఆశయం కోసం కృషి చేస్తామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ అన్నారు. కామ్రేడ్ ధర్మన్న 22వ వర్ధంతిని ధర్మన్న స్మారక భవనంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఈ.భూషణం, బి.వినోద్, ఇఫ్టూ నాయకులు మంచిలి రాజు, ముప్పిడి అబ్బులు, తమ్మిసోమలింగ మల్లికార్జునరావు, పోడిదోలు దుర్గారావు, పీవోడబ్ల్యు నాయకులు కె.రామలక్ష్మి తదితరులు ధర్మన్నకు నివాళులర్పించారు

బుట్టాయగూడెం : అమరుడు ధర్మన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ అన్నారు. ధర్మన్న 22వ వర్ధంతి కార్యక్రమాన్ని లంకపాకలలో చింతల కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆదివాసీ గిరిజనులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడు ధర్మన్న అని అన్నారు. అనంతరం ధర్మన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ గోవిందరాజు, పీవైఎల్ నాయకులు కె.పోతురెడ్డి, టి.బాబూరావు, కేఎస్ రాజు పాల్గొన్నారు.



భోగోలులో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్వరరావు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డ్ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు



కామవరపుకోట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో భోగి మంటలు చుట్టూ విద్యార్థుల ఆటపాటలు



బొర్రంపాలెంలో వాలీబాల్ విజేతలకు షీల్డ్, బహుమతులు అందజేస్తున్న సీఐ బి.వెంకటేశ్వరరావు



కామవరంలో హోరాహోరీగా ఆడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

చింతలపూడి : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాఘవాపురం గ్రామంలో కోండ్రు కిషోర్ క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఈ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వహించడం వల్ల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఎమ్మెల్యే అన్నారు. సంక్రాంతి సందర్భంగా యువత చెడు వ్యసనాలకు పోకుండా క్రీడా పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, సర్పంచ్ వజ్ర కిషోర్, సొసైటీ అధ్యక్షుడు చుండూరి నాగేశ్వరరావు, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

లింగపాలెం : యువత జూదాల వైపు మరలకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని చింతలపూడి సీఐ మల్లేశ్వరరావు అన్నారు. భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు ఆధ్వర్యంలో భోగోలు గ్రామంలో గురువారం ఆటల పోటీలను సీఐ మల్లేశ్వరరావు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డ్ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై పి.చెన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనుగంటి చిన్న రంగారావు, నారిశెట్టి రామారావు, గ్రామస్తులు క్రీడాకారులు పాల్గొన్నారు.



రాఘవాపురంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



గంగవరంలో ముగ్గుల పోటీలు నిర్వహించిన దృశ్యం

కామవరపుకోటలో...

కామవరపుకోట : కామవరపుకోట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానీయల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. మండల వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక హైస్కూల్ రోడ్డులో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జ్యోతి, జోన్ చైర్మన్ కొండూరు పద్మిని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలో గురువారం సంక్రాంతి రంగవల్లుల పోటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిదాయకమైన రీతిలో సాంప్రదాయ పోటీలను నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రు నాగబాబు, బల్లే కేశవ్, బల్లె నరేష్ సమకూర్చిన రూ.25వేలు విజేతలకు బహుమతులుగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీలు కొండేపాటి చింతయ్య, తమ్మిర్సి బ్రహ్మయ్య, నారా అన్నపూర్ణాదేవి, మద్దిపాటి సోమేశ్వరరావు, వూసా దామోదరం, ఈదుపుగంటి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

టి.నరసాపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా టి.నరసాపురం పోలీసుల ఆధ్వర్యంలో బొర్రంపాలెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల విజేతలకు జీలుగుమల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులను అందజేశారు. మొత్తం 13 టీమ్‌లు పాల్గొనగా, ప్రథమ బహుమతి బొచ్చిలేటివారిగూడెం, ద్వితీయ బహుమతి రామమ్మగూడెం టీమ్‌లు దక్కించుకున్నాయి. ఆయా టీమ్‌లకు షీల్డ్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై కె.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరుపాడులో ముగ్గుల పోటీలు

వేలేరుపాడు : వేలేరుపాడు పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, కప్స్ గేమ్‌లను నిర్వహించారు. విజేతలకు ఎస్సై శ్రీనివాసరావు బహుమతులు అందించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన పి.ధరణి (గుల్లవాయిగ్రామం), సోడే జ్యోతి (మద్దిగట్ల గ్రామం), కంగాల వెంకరమణ (పాత పూచిరాల గ్రామం) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి మిక్సీ, కుక్కర్, డిన్నర్ సెట్‌లను బహుమతులు ఎస్సై అందజేశారు.

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల గ్రామమైన కామవరంలో గిరిజన యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. వెలుగు ఏపీడీ మడివి నాగేశ్వరరావు, న్యాయవాది, మాజీ ఎంపీటీసీ యు.ఏసుబాబు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గిరిజన యువత సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చెడు మార్గంలో పయనించకుండా సాంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి.

జూదంతో కుటుంబాలకు నష్టం

కామవరపుకోట : కోడిపందేలు, పేకాట గుండాట వంటి జూదాల ఆడటం వలన ఆర్థిక నష్టం కలుగుతుందని తడికలపూడి ఎస్సై కె.వెంకన్న అన్నారు. గురువారం కామవరపుకోట ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వెంకన్న మాట్లాడుతూ జూదం జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో, బంధువులతో సంక్రాంతి పండుగ ఆనందంగా గడపాలన్నారు. మండలంలో ఎవరైనా కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించడానికి స్థలాలు ఎవరైనా ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్రాంతిని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

చింతలపూడి : తెలుగు సాంప్రదాయ పండుగ సంక్రాంతిని ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. పాత చింతలపూడిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో కృష్ణజ్యోతి మాట్లాడుతూ పండుగ విశిష్ట గురించి గ్రామాల్లో అందరూ అవగాహనతో సంతోషంగా జరుపుకోవాలని కోరారు. జూదాల జోలికి పోకుండా యువత వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలు నిర్వహించుకోవాలన్నారు. సదస్సులో చింతలపూడి తహసీల్దార్ కృష్ణ జ్యోతితో పాటు ఎస్సై డి.హరికృష్ణ, వీఆర్‌వో శ్రీను, ఆర్ఐ కాంతామణి, గ్రామంలోని ఉన్న పెద్దలు, యువత పాల్గొన్నారు.

కోడిపందేల బరిలో హెచ్చరికల బేనర్‌ల ఏర్పాటు

బుట్టాయగూడెం : సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్. శారాశాంతి, ఎస్సై ఎం. జయబాబులు అన్నారు. దొరమామిడిలో కోడిపందేల నిర్వహణపై తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కోడిపందేల నిర్వహణ స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. మహిళా పోలీసులు, వీఆర్‌ఓలు గ్రామాల్లోని పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. దొరమామిడి, బూసరాజుపల్లి సమీపంలో కోడిపందేల బరులను పరిశీలించి పోలీసు, రెవెన్యూ అధికారుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, కార్యదర్శి బుజ్జమ్మ, వీఆర్‌ఓ ఆశ, గ్రామస్తులు, మహిళా పోలీసులు, జాయింట్ యాక్షన్ టీమ్, తదితరులు పాల్గొన్నారు.



బూసరాజుపల్లిలో కోడిపందేల బరుల వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

రూ.88.49 లక్షలతో మిగులు బడ్జెట్


జంగారెడ్డిగూడెం: రూ. 88.49 లక్షల రూపాయల మిగులు బడ్జెట్ ఆమోదం పొందింది. గురువారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షత వహించగా, అధికారులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ. 3,02,86,610 ఉండగా, ఈ ఏడాది మొత్తం ఆదాయం రూ.16.76కోట్లు కాగా, మొత్తం వ్యయం రూ.18.91 కోట్లుగా చూపారు. దీనిలో రూ.1.4 కోట్లు నీటి సరఫరాకు, రూ. 0.90కోట్లు మురుగునీటి పారుదలకు, రూ. 1.34 కోట్లు రహదారులకు, పార్కులకు రూ.0.70 కోట్లు, వీధిలైట్లకు రూ. 0.49 కోట్లు, ప్రజారోగ్యం, మార్కెట్‌కమ్యూనిటీ హాల్ నిర్వహణకు రూ. 1.20 కోట్లు కేటాయించారు. మురికివాడల అభివృద్ధికి 40శాతం (నికర నిధులు) కేటాయించగా, రూ. 1.62 కోట్లు ఖర్చును చూపారు. ఎస్సీల అభివృద్ధికి రూ. 0.91కోట్లు, ఎస్టీల అభివృద్ధికి రూ. 0.45కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ. 0.30కోట్లు, విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి రూ. 0.18 కోట్లు కేటాయించారు. ఒప్పంద కార్మికుల జీత భత్యాల కోసం రూ. 3.34 కోట్లు ఖర్చుగా చూపించారు. పరిపాలన వ్యయం కింద రూ. 0.65 కోట్లు కేటాయించారు. కార్యకలాపాలు, నిర్వహణ కోసం రూ. 5.35కోట్లు, కార్యక్రమాలు ఖర్చులు 0.07 కోట్లు కేటాయించారు. వీటన్నింటి మొత్తంగా 9.45 కోట్లు వ్యయం అవుతుందని బడ్జెట్‌లో చూపారు. బడ్జెట్ సమావేశం అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కాగా, కౌన్సిల్ సభ్యులు పలువురు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఏం జరుగుతుందో తమకు తెలియడం లేదని, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. ఏ సమాచారం సక్రమంగా ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు, ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి


బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గల మండలాల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీఓ పి.అరుణ్‌బాబు అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నాడు- నేడు పనులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా, శిశు సంక్షేమ శాఖ, తదితర అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడులో చేపట్టిన పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో మరుగుదొడ్ల ప్రహరీల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని సీడీపీఓలను ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో అందిస్తున్న వైద్యసేవలను డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా కచ్చితమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీడీ నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి, డీఎంఓ ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



కేఆర్‌పురం ఐటీడీఏలో అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అరుణ్‌బాబు

ప్రజాప్రతినిధులు సహకరించాలి

జంగారెడ్డిగూడెం : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజా ప్రతినిధులు సహకరించాలని డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం సంక్రాంతి - జూదక్రీడల నిషేదం అనే అంశంపై డీఎస్పీ కౌన్సిలర్‌తో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కోడిపందేలు, జూదక్రీడలు నిర్వహించకుండా పోలీసు శాఖ ద్వారా చేపట్టాల్సిన అన్ని చర్యలు చేపట్టామని, ప్రజాప్రతినిధులు కూడా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సంక్రాంతిని కుటుంబసభ్యులతో నిర్వహించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవీరత్నం, తహసీల్దార్ స్లీవజోజి, మండల ప్రత్యేకాధికారి కృపావరం, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

ఉత్సాహంగా గడపగడపకు

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ పంచాయతీలోని కన్నాయిగూడెంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. అనంతరం పొంగుటూరు నుంచి యర్నగూడెం వెళ్లే మెయిన్‌రోడ్‌లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, గొడ్డటి నాగేశ్వరావు, ఎంపీటీసీ నేలపొగుల దుర్గారావు, సర్పంచ్ పసుపులేటి రాంబాబు, మట్ట సత్తిపండు, నూతలపాటి జయరాజు, తోట శ్రీను, చింతల సత్యనారాయణ, కైకారపు గోపి, నూతలపాటి అనిల్, మన్నిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకులు చల్లా ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్వామి వివేకానంద గొప్ప ఆధ్యాత్మిక, మానవతావాది అని, ఆయన చూపిన మార్గంలో యువత పయనించాలని ఐకార్ మెంబర్ అర్జుల మురళీ కృష్ణ, పీపీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు అన్నారు. స్థానిక శేషాద్రి నగర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్వామి వివేకానంద జయంతిని విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని హైస్కూల్ ఎదురుగా ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కామవరపుకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-96 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కామవరపుకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 25 సంవత్సరాల క్రితం చదువుకున్న 1995–1996 టెన్త్ బ్యాచ్ గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాలహాతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఆలనాటి ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సుధాకర్, సుధారాణి, సత్యనారాయణ, ఝాన్సీ, కూసం రమేష్, చింతపల్లి డేవిడ్ రాజు, పీఎస్వీ సత్యనారాయణలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలకు రూ.20 వేల విలువ గల రెండు ఇనుప బీరువాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ప్రశాంత్ కుమార్ పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

అధిక ధరలకు సినిమా టిక్కెట్ల విక్రయాలపై గగ్గోలు

కొయ్యలగూడెం : అధిక ధరలకు సినిమా టికెట్లు విక్రయించడంతో అభిమానులు గగ్గోలు పెడుతున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇద్దరు అగ్ర నాయకుల చిత్రాలు వరుస రోజుల్లో రిలీజ్ కావడంతోనే ఉన్న రెండు థియేటర్లలో ధరలు స్లాబ్ రేట్ల కంటే ఎక్కువ విక్రయిస్తున్నారని ప్రేక్షకులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బెనిఫిట్ షో మాటున రూ.500 పైబడి టికెట్లను విక్రయిస్తుండడంతో అభిమానులకు టిక్కెట్ల విక్రయదారులకు మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణిదివ్య థియేటర్ వద్దకు చేరుకొని అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వెళ్లారు. వారు వెళ్లిన తరువాత పరిస్థితి షరా మామూలేనని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.